
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY 5

విజయనగరం

జిల్లా వార్తలు

గురువారం 4 ఏప్రిల్ 2024



టీడీపీపై విష ప్రచారం..

ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన తరువాత శృంగవరపుకోట మండలం అలుగుబల్లి గ్రామానికి చెందిన ఇద్దరు గ్రామ వలంటీర్లు వైసీపీ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. దీనిపై కలెక్టర్ నాగలక్ష్మికు ఫిర్యాదు అందింది. మండల ఎన్నికల అధికారి, ఎంపీడీవో సాంబశివరావుతో విచారణ చేయించారు. నిజమేనని నిర్ధారణకు రావడంతో ఇద్దరు వలంటీర్లను తొలగించారు. ఇలా జిల్లా వ్యాప్తంగా దాదాపు 14 మంది వలంటీర్లను విధుల నుంచి తప్పించారు. ఇలా చాలామంది వలంటీర్లు వైసీపీతో అంటగాగుతున్నారు. ప్రచార కార్యకర్తల్లా మారారు. ఎన్నికల కమిషన్ నిబంధనలకు విరుద్ధంగా ప్రవర్తిస్తున్నారు. దీంతో సామాజిక పింఛన్ల పంపిణీకి వారిని దూరంగా పెట్టాలని ఎన్నికల కమిషన్ ఆదేశించింది. దీన్నికూడా వైసీపీ రాజకీయంగా వాడేసుకుంటుంది. ప్రతిపక్షాల వలనే వలంటీర్లను పింఛన్ల పంపిణీ బాధ్యత నుంచి తప్పించారంటూ దుష్ప్రచారం చేస్తోంది. తెలుగుదేశం పార్టీ ఫిర్యాదుతోనే వలంటీర్లను పింఛన్లు పంపిణీ చేయకుండా తప్పించారని విష ప్రచారానికి దిగింది. అయితే, పత్రికల్లో వచ్చిన కథనాలు, ఫిర్యాదులు, హైకోర్టు తీర్పుకు అనుగుణంగానే ఎన్నికల కమిషన్ వలంటీర్లతో పింఛన్ల పంపిణీ చేయవద్దని ఆదేశించిందని, కానీ వైసీపీ నేతలు టీడీపీయే కారణం అనడం ఏంటని జనాలు మండిపడుతున్నారు. ప్రభుత్వాన్ని తిట్టిపోస్తున్నారు.

పింఛన్‌దారులపై వైసీపీ కక్ష

- సచివాలయాలకు చేరని నగదు
- కావాలనే బ్యాంకులకు జమ చేయని ప్రభుత్వం
- వలంటీర్లను తప్పించడంతోనే ఆలస్యమంటూ వైసీపీ దుష్ప్రచారం
- సచివాలయ ఉద్యోగుల ప్రదక్షిణలు
- ప్రభుత్వాన్ని తిట్టిపోస్తున్న పింఛన్‌దారులు



విజయనగరం లంకవీధిలోని 33వ సచివాలయం పరిధిలో డబ్బులు రాక పింఛన్ల కోసం నిరీక్షిస్తున్న దృశ్యం

ప్రభుత్వ నిర్లక్ష్యం పింఛన్‌దారుల పాలిట శాపంగా మారింది. ఎలాంటి ఇబ్బంది లేకుండా పింఛన్ సొమ్ము పంపిణీ చేస్తామని చెప్పి మోసం చేసింది. బ్యాంకులకు అరకొరగా నగదు జమచేయడంతో జిల్లాలో బుధవారం పింఛన్ల పంపిణీ అరకొరగా జరిగింది. ఉదయం నుంచి రాత్రి వరకూ పింఛన్‌దారులు పడిగాపులు కాశారు. మరోపక్క సచివాలయాల వద్ద టెంట్లు, కుర్చీలు ఏర్పాటు చేయకపోవడంతో ఎండలోనే నిరీక్షించారు. ఇదంతా ప్రభుత్వం కావాలనే చేసిందన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. విపక్షంపై విషం చిమ్మేందుకు ఈ నాటకాలడుతోందని జనాలు మండిపడుతున్నారు. ప్రభుత్వాన్ని తిట్టిపోస్తున్నారు.

● శృంగవరపుకోట మండలంలో 20 గ్రామ సచివాలయాల వరకు ఉన్నాయి. బుధవారం సాయంత్రం 4 గంటల వరకు ఈ సచివాలయాల పరిధిలోని పింఛన్‌దారులకు నగదు పంపిణీ చేసేందుకు కేవలం రూ.10.78 లక్షలు మాత్రమే బ్యాంకు ఖాతాలకు జమయ్యాయి. రూ.381 నుంచి రూ.1.03 లక్షల వరకు బ్యాంకు ఖాతాల్లో కనిపించడంతో ఈ సొమ్మును తీసుకువెళ్లి ఎవరికి పంపిణీ చేయాలో అర్థంకాక సచివాలయ ఉద్యోగులు తలలు పట్టుకుంటున్నారు. ఉదాహరణకు శృంగవరపుకోట పంచాయతీలోని ఓ సచివాలయానికి చెందిన పింఛన్‌దారులకు రూ.19.51 లక్షలు అవసరం. కానీ, బ్యాంకులో రూ.80.662 మాత్రమే జమకావడంతో పింఛన్ల పంపిణీ చేపట్టలేదు. ఈ పరిస్థితి జిల్లావ్యాప్తంగా ఉంది.

(విజయనగరం-ఆంధ్రజ్యోతి)/ శృంగవరపుకోట, ఏప్రిల్ 3

జిల్లాలో 2,82,748 మంది పింఛన్‌దారులు ఉన్నారు. వీరికి ప్రతి నెల పింఛన్ అందించేందుకు రూ.84.84 కోట్లు అవసరం. ప్రతినెల ఒకటో తేదీ నుంచి వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి పింఛన్లు పంపిణీ చేసేవారు. ప్రస్తుతం ఆ బాధ్యతల నుంచి వలంటీర్లను ఎన్నికల కమిషన్ తప్పించింది. వారి స్థానంలో గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులకు పింఛన్ల పంపిణీ చేసే బాధ్యతను ప్రభుత్వం అప్పగించింది. అయితే, బుధవారం సాయంత్రం వరకూ పింఛన్ల పంపిణీకి అవసరమైన నగదును మాత్రం బ్యాంకులకు జమ చేయలేదు. ఈ నగదు కోసం బ్యాంకుల వద్ద సచివాలయ ఉద్యోగులు పడిగాపులు కాస్తున్నారు. బ్యాంకుల వద్దకు రావడం, ఖాతాలను తనిఖీ చేయడం.. నగదు జమకాకపోవడంతో తిరిగి సచివాలయాల్లో పనులు చూసుకొనేందుకు వెళ్లడంతోనే రోజంతా గడిచింది. నగదు ఎప్పుడు జమవుతుందో మండల స్థాయి అధికారులే చెప్పలేకపోతున్నారు. బుధవారం రాత్రికి ఏ సమయానికైనా జమవుతుందని, గురువారం ఉదయం నుంచి పంపిణీ చేస్తామని చెబుతున్నారు. ప్రతి నెల ఒకటో తేదీ తెల్లవారుజామున చేతికి అందే డబ్బులు ఈ నెలలో మూడు రోజులు గడిచినా అందకపోవడంతో పింఛన్‌దారులు ఇబ్బందులు పడుతున్నారు. వీరిలో వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులు ఉన్నారు.

ఇంటింటికీ వెళ్లి అందించండి..

గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులు పింఛన్‌దారుల ఇళ్లకు వెళ్లి పింఛన్లు పంపిణీ చేయాలని టీడీపీ డిమాండ్ చేస్తోంది. ఇప్పటికే మండల పరిషత్ అధికారులు, మున్సిపల్ కమిషనర్ల టీడీపీ నేతలు వినతిపత్రాలు అందించారు. పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు సీఎస్ జవహర్‌రెడ్డి, సెర్ప్ కమిషనర్ తదితరులకు లేఖ రాశారు. వైసీపీ చేస్తున్న తప్పుడు ప్రచారం నమ్మకుండా ఉండేందుకు ప్రజలకు బహిరంగ లేఖ రాశారు. జిల్లాలో 626 గ్రామ, వార్డు సచివాలయాలు ఉన్నాయి. ఇందులో 11 నుంచి 12 డిపార్ట్‌మెంట్లకు చెందిన ఉద్యోగులు పని చేస్తున్నారు. గ్రామ సచివాలయాల్లో 8,872 మంది, వార్డు సచివాలయాల్లో 1827 మంది ఉద్యోగులు విధులు నిర్వహిస్తున్నారు. ప్రతి సచివాలయ పరిధిలో నాలుగు వేల జనాభా మాత్రమే ఉంది. 100 నుంచి 800 మంది వరకు పింఛన్‌దారులు ఉంటారు. ఇప్పటికే వీరితో పరిచయం ఉన్న సచివాలయ ఉద్యోగులు ఇంటింటికీ వెళ్లి పింఛన్లు ఇవ్వడం పెద్ద కష్టమేమీ కాదు. ఇదే విషయాన్ని టీడీపీ సూచించింది. ఇంటింటికీ వెళ్లి సామాజిక పింఛన్లు అందించాలని పట్టుబడుతుంది. కానీ, టీడీపీపై వ్యతిరేకత కలగాలన్న వైసీపీ ఆలోచనకు అనుగుణంగా ప్రభుత్వ అధికారులు నడుకుంటున్నారనే విమర్శలు ఉన్నాయి. అందుకే ఇంటింటికీ పింఛన్ల పంపిణీకి అవకాశం ఇవ్వడం లేదని టీడీపీ నాయకులు ఆరోపిస్తున్నారు. ఎన్నికల కోడ్ పూర్తయ్యే వరకూ కేవలం సచివాలయాల వద్ద పంపిణీ చేయాలని, మంచం మీద నుంచి లేవలేని స్థితిలో ఉన్న వారి ఇళ్లకు మాత్రమే వెళ్లి పింఛన్లు అందించాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. గురువారం నుంచి శనివారం లోపు శతశాతం పూర్తి చేయాలని చెప్పింది. కానీ, బుధవారం రాత్రయినా నగదు మాత్రం బ్యాంకులకు జమకాలేదు. జిల్లాలో 28.12శాతం పింఛన్ల పంపిణీని పూర్తి చేసినట్లు డీఆర్‌డీఏ పీడీ కళ్యాణ్ చక్రవర్తి తెలిపారు.

యాభై శాతం లోపే..

రేగిడి: మండలంలో 25 సచివాలయాల పరిధిలో 10,996 మంది పింఛన్‌దారులు ఉన్నారు. వీరికి ప్రతినెల పింఛన్ అందించేందుకు రూ.3.19 కోట్లు అవసరం. కానీ, ఈ నెల యాభై శాతం లోపే బ్యాంకుకు నగదు జమయింది. నగదు కొరతతో కొన్ని సచివాలయాల్లో పింఛన్ల పంపిణీ నిలిచిపోయింది. బుధవారం సాయంత్రం 6గంటలైనా పింఛన్లు పంపిణీ జరగలేదు. ఈ విషయమై ఎంపీడీవో శ్యామలాకుమారి వివరణ కోరగా.. 'బుధవారం సాయంత్రానికి రెండు విడతలుగా రూ.1.32కోట్లు జమయ్యాయి. ఈ నగదును పింఛన్‌దారులకు ఇబ్బంది లేకుండా పంపిణీకి చర్యలు చేపట్టాం.' అని తెలిపారు.



విజయనగరం 33వ సచివాలయంలో డబ్బులు రాక ఎండలో నిరీక్షిస్తున్న దృశ్యం

అరకొరగా..

విజయనగరం రూరల్/విజయనగరం దాసన్నపేట: విజయనగరం మండలంలో అరకొరగా పింఛన్ల పంపిణీ జరిగింది. సారిక, కొరుకొండ, కోరుకొండ పాలెం తదితర సచివాలయాల పరిధిలో బుధవారం మధ్యాహ్నం 2 గంటల తరువాత పింఛన్ల పంపిణీ చేపట్టారు. మండలంలో 6,097 పింఛన్‌దారులకు గాను 3,102 మందికి పంపిణీ చేశారు. విజయనగరంలోని 10, 33 సచివాలయాలు (పీఎస్సార్ కాలనీ, రాజీవ్‌నగర్ కాలనీ, లంకవీధి) తదితర ప్రాంతాల్లో సాయంత్రం 5 గంటల వరకూ పింఛన్ల పంపిణీ జరగలేదు.



డోర్‌టూడోర్ పింఛన్లు పంపిణీ చేయాలని ఎస్.కోట ఎంపీడీవోకు వినతిపత్రం అందిస్తున్న టీడీపీ నాయకులు (ఫైల్)



డబ్బులు వస్తాయని చెప్పడంతో బొబ్బిలి నరేంద్రదేవ్ స్కూల్‌లో రాత్రి వరకూ వేచి ఉన్న 16,17 వార్డుల పింఛన్‌దారులు



రాజాం: లచ్చయ్యపేట సచివాలయం వద్ద ..

పడిగాపులు..

రాజాం: పురపాలక సంఘంలోని 11 వార్డు సచివాలయాల పరిధిలో 4వేల మంది పింఛన్‌దారులు ఉన్నారు. వీరికి రూ.1.50 కోట్లు అవసరం. అయితే, మాదిగవీధి, లచ్చయ్యపేట సచివాలయాలకు మాత్రమే అరకొరగా నిధులు మంజూరయ్యాయి. మిగతా చోట్ల పింఛన్‌దారులు పడిగాపులు కాశారు. రాజాం పట్టణంలోని సత్యనారాయణపురం, కొండంపేట, ఆదర్శనగర్, తదితర సచివాలయాల్లో పరిధిలో బుధవారం మధ్యాహ్నం 12 గంటల నుంచే పింఛన్ల కోసం నిరీక్షించారు. లచ్చయ్యపేట సచివాలయం -2లో చీకట్లోనే పింఛన్లు పంపిణీ చేశారు. పింఛన్లు అందక వస్త్రపురికాలనీ వాసులు వెనుతిరిగారు. గురువారం నుంచి పూర్తి స్థాయిలో పంపిణీ చేపడతామని పురపాలక సంఘం మేనేజర్ ఎంవీ నాగరాజు తెలిపారు ● రాజాం మండలంలోని 17 గ్రామ సచివాలయాల పరిధిలోని 8,012 పింఛన్లకు గాను రూ.2.34కోట్లు మంజూరయ్యాయి గురువారం ఉదయం నుంచి పంపిణీ చేస్తామని ఇన్‌చార్జి ఎంపీడీవో వావిలపల్లి శ్రీనివాసరావు తెలిపారు. ● **బొబ్బిలి:** అదిగో క్యాష్ వచ్చేస్తోంది.. ఇదిగో క్యాష్ వచ్చేస్తోంది... అంటూ అధికారులు చెబుతుండడంతో బుధవారం రాత్రి 7.30 గంటలు దాటే వరకు సచివాలయాల దగ్గర అటు సిబ్బంది, ఇటు పింఛన్‌దారులు పడిగాపులు కాశారు. 35.34 శాతం పింఛన్లు పంపిణీ చేసినట్లు మునిసిపల్ కమిషనరు లాలం రామలక్ష్మి బుధవారం రాత్రి ఒక ప్రకటనలో తెలిపారు.



భోగాపురం పెదఎస్సీ వీధి ఆరుబయటే ఉన్న పింఛన్‌దారులు

సౌకర్యాలేవి?

భోగాపురం/వంగర: వేసవిలో ఎండ తీవ్రత దృష్ట్యా పింఛన్‌దారులకు సచివాలయాల వద్ద టెంట్లు, తాగునీరు వంటి కనీస మౌలిక సౌకర్యాలు కల్పించాలని కలెక్టర్ ఆదేశించారు. కానీ, చాలాచోట్ల ఈ ఏర్పాట్లేవీ కన్పించలేదు. లబ్ధిదారులకు కనీసం కూర్చోవడానికి కుర్చీలు కూడా వేయలేదు. టెంట్లు, కుర్చీలకు డబ్బులు ఎవరు పెడతారని సచివాలయ సిబ్బంది ప్రశ్నిస్తున్నారు. దీంతో పింఛన్‌దారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

వెనుదిరిగారు..

నెల్లిమర్ల: పింఛన్‌దారులకు సొమ్ము అందించడంలో సచివాలయ ఉద్యోగులు విఫలమయ్యారు. బుధవారం ఉదయం 10 గంటలకే సచివాలయ ఉద్యోగులు బ్యాంకుకు వెళ్లి సొమ్ము తీసుకువచ్చి పింఛనుదారులకు పంపిణీ చేయాల్సి ఉంది. కానీ, సాయంత్రం 4 గంటలైనా వారు బ్యాంకు నుంచి తిరిగి సచివాలయాలకు రాకపోవడంతో పింఛన్‌దారులు తీవ్ర అసహనానికి లోనయ్యారు. ఉత్తచేతులతోనే వెనుదిరిగారు.



కొండగుంపాం సచివాలయం నుంచి వెనుదిరిగిన వృద్ధులు

సిరి సంబరం

- ఘనంగా కొట్టాం కోటమ్మ సిరిమానోత్సవం
- పోటెత్తిన భక్తులు



సిరిమానుపై పూజారి నాగభూషణం

శృంగవరపుకోట రూరల్, ఏప్రిల్ 3: ఉత్తరాంధ్రుల ఇలవేల్పు ఎస్.కోట మండలంలోని కొట్టాం కోటమ్మతల్లి సిరిమానోత్సవం బుధవారం అంగరంగ వైభవంగా జరిగింది. ఈ సంబరానికి ఆంధ్ర, తెలంగాణ, ఒడిశా, ఛత్తీస్‌గడ్ రాష్ట్రాల నుంచి వేలాదిగా భక్తులు తరలివచ్చారు. సాయంత్రం 5.30 గంటలకు సిరిమాను పూజారి రందీ నాగభూషణంను గ్రామపెద్ద సేనాపతి కోటరావు నాయుడు, ట్రస్టుబోర్డు చైర్మన్ సేనాపతి రమణబాబు ఆధ్వర్యంలో గద్దె గుడి నుంచి సిరిమాను వద్దకు ఊరేగింపుగా తీసుకొచ్చారు. అనంతరం సిరిమానును పూజారి నాగభూషణం అధిరోహించారు. వేలాదిమంది భక్తుల మధ్య సిరిమానోత్సవం జరిగింది. జైకోటమ్మ నామస్మరణ మార్మోగింది. సిరిమాను వెంబడి అంజలీ రథాలు, కోటమ్మ మాలధారులు, కోటమ్మపచ్చడితో నెయ్యిల కులస్థులు కదిలారు. రాత్రి 7.15 గంటలకు చిన్నమ్మి గుడికి సిరిమాను చేరింది. ఈ కార్యక్రమాన్ని సర్పంచ్ సేనాపతి బాలసన్యాసమ్మ, గ్రామపెద్ద చంద్రరావు పర్యవేక్షించారు. 50వేలకు పైబడి భక్తులు హాజరైనట్లు అంచనా. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఈవో నాగేంద్ర ఏర్పాట్లు చేశారు.

కోటమ్మతల్లి సిరిమానోత్సవం జరుగుతున్న దృశ్యం



మంత్రివర్యా.. ప్రజల అవస్థలు పట్టవా?

- నత్తనడకన చీపురుపల్లి నూతన రైల్వే వంతెన పనులు
- పూర్తి చేయించడంలో జిల్లా ప్రజా ప్రతినిధులు విఫలం
- విద్యార్థులు, ప్రయాణికులకు తప్పని ఇబ్బందులు

(విజయనగరం-ఆంధ్రజ్యోతి)

ఆ నియోజకర్గంలో ప్రాతినిధ్యం వహిస్తున్నది మంత్రి బొత్స సత్యనారాయణ. ఇదే నియోజవర్గానికి చెందిన మరో నేత ఎంపీ బెల్లాన చంద్రశేఖర్. ఈ నియోజవర్గం పరిధిలోని మెరకముడిదాం మండలానికి ప్రాతినిధ్యం వహిస్తున్నారు మరోనేత జడ్పీ చైర్మన్ చిన్న శ్రీను. ఇలాంటి కీలకనేతలు ఉన్నా ఎంతో ప్రాధాన్యమైన చీపురుపల్లి నూతన రైల్వే వంతెన పనులను (ఆర్‌ఓబీ) పూర్తి చేయించడంలో మాత్రం చొరవ చూపడం లేదు. దీంతో ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. జిల్లా నేతల వైఫల్యంతోనే రైల్వే వంతెన పూర్తి కావడం లేదనే విమర్శలు ఉన్నాయి. జిల్లాలోనే ఎంతో ప్రాముఖ్యమైనది చీపురుపల్లి రైల్వే వంతెన. విశాఖ, విజయనగరం, నెల్లిమర్ల, గుర్ల, గరివిడి ప్రాంతాల ప్రజలు రాజాం, పాలకొండ తదితర ప్రాంతాలకు వెళ్లాలన్నా, పాలకొండ, రాజాం చుట్టుపక్కల వారంతా విజయనగరం, విశాఖ వెళ్లాలన్నా చీపురుపల్లి రైల్వే వంతెన దాటాల్సిందే. బ్రిటీష్ కాలంలో నిర్మించిన ఈ వంతెన కూలిపోయేందుకు సిద్ధంగా ఉన్నట్లు గుర్తించిన అధికారులు 2022 నుంచి భారీ వాహనాలను(హెవీ) అనుమతించడం లేదు. నూతన వంతెన నిర్మాణం కోసం రైల్వే శాఖ రూ.12.97 కోట్లు మంజూరు చేసింది. రెండేళ్ల నుంచి ఈ పనులు నత్తనడకన సాగుతున్నాయి. దీంతో ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. గుర్ల, గరివిడి, చీపురుపల్లి మండలాల నుంచి నిత్యం వందలాది మంది విద్యార్థులు ఈ వంతెన గుండానే రాజాం, పాలకొండ ప్రాంతాలకు చదువులకు వెళ్తుంటారు. అయితే, వంతెన పనులు పూర్తికాకపోవడంతో చీపురుపల్లి వరకు ఒక బస్సులో వచ్చి అక్కడ నుంచి ఆర్‌ఓబీ అవల నిలిచిన బస్సు వరకు చేరుకుని రాజాం, పాలకొండ వెళ్లాల్సి వస్తోంది. మిగతా ప్రయాణికులు కూడా ఇవే పాట్లు పడుతున్నారు. అలాగే పాలకొండ, రాజాం ప్రాంతాల నుంచి విశాఖ, విజయనగరానికి నేరుగా ఎక్స్‌ప్రెస్ సర్వీసుల్లో వెళ్లాల్సిన వారు మెరకముడిదాం మండలం మీదుగా చుట్టుతిరిగి వెళుతున్నారు. పాలకొండ బస్సులు చిలకపాలెం మీదుగా విశాఖ వెళుతున్నాయి. బస్సు దిగి వేరే బస్సుకు వెళితే చార్జీలు 5నుంచి పది రూపాయలు అదనంగా అవుతున్నాయి. అలాగే కాలం వృథా అవుతుందని ప్రయాణికులు వాపోతున్నారు.



ఆర్‌ఓబీ వద్ద నిలిచిన బస్సులు, ఇతర వాహనాలు

చాలా ఇబ్బంది పడుతున్నాం..

చీపురుపల్లి కాంప్లెక్స్‌లో మేము బస్సు దిగి ఆర్‌ఓబీ వరకు నడిచి అవల ఉన్న బస్సుల కోసం వెళ్తున్నాం. పుస్తకాల బ్యాగులు, కేరీజీలు మోసుకుని అవతలకు వెళ్లేందుకు చాలా ఇబ్బందులు పడుతున్నాం. ఎప్పుడు కొత్త వంతెన అందుబాటులోకి వస్తుందా అన్న ఆశతో ఎదురు చూస్తున్నాం. రాకపోకలకు ఇబ్బందులు తొలగిలే చర్యలు తీసుకోవాలి.

-రామకృష్ణ, విద్యార్థి

ప్రయాణానికి అవస్థలు..

నేను విజయనగరం నుంచి రాజాం వెళ్లేందుకు బస్సు ఎక్కాను. బస్సు బోర్డు అయితే రాజాం అని ఉంది. కానీ బస్సు మాత్రం చీపురుపల్లి వరకు మాత్రమే వెళ్లింది. ఇదేమని కండక్టర్‌ను అడిగితే చీపురుపల్లిలో దిగి రైలు బ్రిడ్జి దాటి వేరే బస్సులో రాజాం వెళ్లాలని కండక్టర్ చెప్పారు. ప్రయాణానికి తీవ్ర అవస్థలు పడుతున్నాం.

-వెంకటనాయుడు, ప్రయాణికుడు

ఎగ్‌నామం

- మూడు రోజులుగా విద్యార్థులకు ఇవ్వని గుడ్లు
- బిల్లులు చెల్లించకపోవడంతో సరఫరా చేయని ఏజెన్సీలు



భోగాపురం ప్రాథమిక పాఠశాలలో బుధవారం గుడ్డు లేకుండా విద్యార్థులకు భోజనం పెట్టిన దృశ్యం

రామభద్రపురం/భోగాపురం, ఏప్రిల్ 3: ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకానికి సంబంధించి మూడు రోజుల నుంచి కోడిగుడ్ల సరఫరా నిలిచిపోయింది. దీంతో విద్యార్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కోడిగుడ్లను సరఫరా చేసే ఏజెన్సీతో పాటు ట్రాన్స్‌పోర్టు చేసే వారికి సుమారు 6 నెలల నుంచి రాష్ట్ర ప్రభుత్వం బిల్లులు చెల్లించడం లేదు. ఫలితంగా ఈ నెల ఒకటో తేదీ నుంచి ప్రాథమిక పాఠశాలలతోపాటు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలకు కూడా గుడ్ల సరఫరా ఒక్కసారిగా నిలిచిపోయింది. దీంతో రామభద్రపురంలో ఉన్న కోడిగుడ్ల గోదాం ఖాళీ అట్టలతో దర్శనమిస్తోంది. ఏజెన్సీ నుంచి గుడ్ల సరఫరా నిలిచిపోవడంతో తాము పాఠశాలలకు అందించలేకపోతున్నామని గోదాము ఇన్‌చార్జి బండారు నాగరాజు తెలిపారు. విద్యాశాఖా మంత్రి బొత్స సత్యనారాయణ సొంత జిల్లాతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా ఈ సమస్య ఉన్నా సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడంపై పిల్లల తల్లిదండ్రులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. విద్యాశాఖకు ప్రాధాన్యత ఇస్తామని ప్రకటనలు గుప్పిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు అందిస్తున్న ఆహారంలో నిర్లక్ష్యం చూపడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నిస్తున్నారు.

ఫిర్యాదులు వచ్చాయి..

కోడిగుడ్లు రావడం లేదని ప్రధానోపాధ్యాయుల నుంచి ఫిర్యాదులు వచ్చాయి. కోడిగుడ్లతో పాటు శనగ చక్కీల సరఫరా కూడా నిలిచిపోయింది. బిల్లులు చెల్లించే వరకూ సరఫరా చేయలేమని ఆయా ఏజెన్సీలు జిల్లా విద్యాశాఖాధికారులకు నోటీసులు కూడా ఇచ్చాయి. ఈ సమస్య రాష్ట్రవ్యాప్తంగా ఉంది.

-అమిటి తిరుమలప్రసాద్, ఎంఈవో, రామభద్రపురం

వడదెబ్బపై అవగాహన

లక్కవరపుకోట (కొత్తవలస): తుమ్మికాపల్లి గ్రామంలో బుధవారం వడదెబ్బపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. వియ్యంపేట పీహెచ్‌సీ వైద్యాధికారి గోపాలకృష్ణ ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది ర్యాలీ చేపట్టారు. వడదెబ్బకు గురికాకుండా తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ సత్యారావు, పద్మావతి, కామేశ్వరి, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

పని ప్రదేశంలో జాగ్రత్తలు తీసుకోవాలి

బొబ్బిలి: ఎండల ప్రభావం చాలా తీవ్రంగా ఉపాధి హామీ పథకంలో జాబ్‌కార్డు వేతనదారులందరికీ తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఏపీడీ జనార్ధనరావు తెలిపారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో క్షేత్రసాంకేతిక సహాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పని ప్రదేశాల్లో అన్ని రకాల జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అందుబాటులో ఉన్న వాటితో నీడ కల్పించాలని, లేకుంటే పందిళ్లు వేసుకోవాలన్నారు. నూతన ఆర్థిక సంవత్సరంలో వేతనదారులందరికీ పని కల్పించాలన్నారు. ప్రాధాన్యతా క్రమంలో ప్రతిపాదించిన పనులన్నిటినీ పూర్తి చేయాలన్నారు. ఏపీవో లక్ష్మీపతిరాజు, ఈసీ కల్యాణచక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.అనంతం నారాయణపువలస గ్రామంలో జరుగుతున్న పనులను పరిశీలించారు. వేతనదారులకు పలు సూచనలు చేశారు.

11వ డివిజన్‌లో 'బాబు చెంతకు బ్రాహ్మణాస్త్రం'

విజయనగరం రూరల్: విజయనగరం 11వ డివిజన్‌లో టీడీపీ బ్రాహ్మణ విభాగం నాయకులు 'బాబు చెంతకు బ్రాహ్మణాస్త్రం' పేరిట ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి అదితి గజపతిరాజును గెలిపించాలని కోరుతూ బ్రాహ్మణ విభాగం నాయకులు గుండాలవారి వీధిలోని బ్రాహ్మణుల ఇంటికి వెళ్లారు. బ్రాహ్మణులు, హిందూ దేవాలయాలపై దాడులు, ఐదేళ్ల కాలంలో బ్రాహ్మణులకు ఈ ప్రభుత్వం ఎటువంటి సంక్షేమ కార్యక్రమాలు నిర్వహించలేదన్న అంశాలతో ప్రచారాన్ని నిర్వహించారు. వైసీపీ హయాంలో ఏ వర్గాల వారికి న్యాయం జరగలేదని, అందరూ దోపిడీకి గురయ్యారన్నారు. ఉద్యోగులు, యువత అంతా తీవ్రంగా నష్టపోయారన్నారు. మళ్లీ టీడీపీ వస్తేనే న్యాయం జరుగుతుందని తెలిపారు. ప్రజలంతా ఈ విషయాన్ని గుర్తించి టీడీపీ అభ్యర్థులను గెలిపించి రాష్ట్రాన్ని కాపాడుకోవాలన్నారు.

పింఛన్లు ఇళ్ల వద్దనే అందించాలి

రామభద్రపురం: అవ్వాతాతల పింఛన్లు సచివాలయ ఉద్యోగులు ఇళ్లకు వెళ్లి ఇవ్వాలని విజయనగరం పార్లమెంటరీ టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు మడక తిరుపతి నాయుడు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సంక్షేమ పథకాల అమలులో ప్రభుత్వం ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయకుండా వృద్ధులను ఇబ్బంది పెట్టడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. తెలుగుదేశం పార్టీకి చెడ్డ పేరు రావాలనే దుర్బుద్ధితో రాష్ట్ర యంత్రాంగం వ్యవహరించడం శోచనీయమన్నారు.

నేటి నుంచి పింఛన్ల పంపిణీ



డిజిటల్ అసిస్టెంట్‌లు, పంచాయతీ కార్యదర్శులకు సూచనలు ఇస్తున్న ఎంపీడీవో

బాడంగి: సచివాలయంతో పాటు దానికి అనుసంధానంగా ఉన్న గ్రామాల్లో కూడా గురువారం నుంచి పింఛన్లు పంపిణీ చేయాలని ఎంపీడీవో ఆంజనేయులు అన్నారు. బుధవారం ఎంపీడీవో కార్యాలయంలో డిజిటల్ అసిస్టెంట్లు, పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. వృద్ధులు, వికలాంగులు, బెడ్‌రెస్టులో ఉన్న వారికి ఇంటి వద్దకు వెళ్లి పింఛన్లు పంపిణీ చేయాలన్నారు. ఈ సమావేశంలో ఈవోపీఆర్‌డీ సూర్యనారాయణ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

పుర్లిలో సామూహిక పూజలు



సముహికపూజలు చేస్తున్న భక్తులు

రేగిడి: పుర్లి గ్రామంలో చిదంబరేశ్వర ఆలయ ప్రారంభ మహోత్సవంలో భాగంగా రెండోరోజు బుధవారం ధర్మకర్త పట్ట పార్వతమ్మ కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో గ్రామస్థులు సామూహిక పూజలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ప్రతిష్ఠోత్సవాల్లో భాగంగా ఉత్తరాంధ్ర వాలీబాల్, కరాటే, మండల స్థాయి క్విజ్ పోటీలు నిర్వహించారు. కరాటే 180 కేజీల విభాగంలో ఒప్పంగికి చెందిన గేదల సత్య నారాయణ, 160 కిలోల విభాగంలో ఆమదాలవలసకు చెందిన రజాక్ ప్రథమ స్థానాలు సాధించారు. వాలీబాల్ పోటీల్లో ఉణుకూరు, చిన్నశిర్లాం వరుసగా ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించాయి. క్విజ్ పోటీల్లో రేగిడి, దేవుదళ పాఠశాలలు తొలి రెండు స్థానాలు సాధించాయి.

వైభవంగా ఇంటమ్మతల్లి తీర్థం



దౌడు తీస్తున్న ఎడ్లు

వేపాడ: వల్లంపూడిలో శ్రీశ్రీశ్రీ ఇంటమ్మ తల్లి తీర్థ మహోత్సవం మంగళ, బుధవారాల్లో వైభవోపేతంగా సాగింది. మొదటి రోజు మంగళవారం గ్రామస్థులు అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. రెండో రోజు బుధవారం ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు అధికసంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎడ్లబండ్ల పరుగు పోటీలు ఉత్సాహభరితంగా సాగాయి. స్థానికులు, భక్తులు ఆసక్తిగా తిలకించారు. ఈ పోటీలలో మొత్తం 16 ఎడ్లబళ్లు పాల్గొనగా విజేతలుగా నిలిచిన ఎడ్లబండ్ల యజమానులకు నిర్వాహకులు నగదు బహుమతులను అందజేశారు. బుధవారం రాత్రి ఏర్పాటుచేసిన బాలనాగమ్మ బుర్రకథ ఆకట్టుకుంది. అనంతరం యువజన సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన డ్యాన్స్ బేబీ డాన్స్ కార్యక్రమం యువతను అలరించింది.

జిల్లాలో కొత్తగా పది వేల మంది ఓటర్లు

● ప్రచారాల్లో పిల్లలను వినియోగించవద్దు ● దివ్యాంగులను కించపరిచేలా మాట్లాడొద్దు: కలెక్టర్ నాగలక్ష్మి



మాట్లాడుతున్న కలెక్టర్ నాగలక్ష్మి

కలెక్టరేట్, ఏప్రిల్ 3: ఓటర్ల జాబితా ప్రకటించిన తరువాత ఇప్పటి వరకూ జిల్లాలో సుమారు పది వేలు మంది కొత్త ఓటర్లుగా చేరారని కలెక్టర్ నాగలక్ష్మి తెలిపారు. కొత్త ఓటర్లు ఓటు కోసం దరఖాస్తు చేసుకోవడానికి ఈనెల 14 వరకూ అవకాశం ఉందన్నారు. బుధవారం రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలెక్టరేట్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పలు అంశాలపై సూచనలు ఇచ్చారు. ప్రస్తుతం కొత్త ఓట్ల చేర్పు మాత్రమే జరుగుతుందని, మిగిలిన వాటికి అవకాశం లేదన్నారు. 18 ఏళ్లలోపు బాల బాలికలను రాజకీయ కార్యకలాపాల్లో వినియోగించకూడదన్నారు. పార్టీల ప్రచారం, పాంప్లెట్లు, జెండాల పంపిణీ, ర్యాలీలు, నినాదాలు ఇవ్వడంతోపాటు రాజకీయ పార్టీలు ప్రదర్శించే సాంస్కృతిక కార్యక్రమాల్లో కూడా పిల్లలను వినియోగించకూడదని స్పష్టం చేశారు. ప్రభుత్వ స్థలాలు, కార్యాలయాల్లో ఉన్న హోర్డింగులను రాజకీయ పార్టీల ప్రచారానికి కేటాయించబోమని తెలిపారు. ప్రైవేటు భవనాలు, ఇళ్లలో ఒక స్టిక్కర్, చిన్నపాటి జెండా లేదా బ్యానర్‌ను పెట్టుకోవచ్చని, అయితే ఆ ఇంటి యజమాని నుంచి అనుమతి పత్రం తీసుకుని 3 రోజుల్లో సమర్పించాలని సూచించారు. ప్రస్తుతం రాజకీయ పార్టీలు చేసే వ్య యం అంతా పార్టీ ఖాతాలోకి వెళ్తుంద ని, నామినేషన్ దాఖలు చేసిన తరు వాత అభ్యర్థి ఖాతాలో లెక్కిస్తారన్నా రు. రాజకీయ పార్టీలు ఎన్నికల ప్రచారంలో విభిన్న ప్రతిభావంతులను కించపరిచే పదాలను వాడవద్దని సూచించారు. కుంటి, గుడ్డి ప్రభుత్వాలు అనే పదాలను వాడటం వల్ల దివ్యాంగుల మనోస్థైర్యం దెబ్బతింటోందని, వారు తీవ్ర మనస్తాపం చెందుతూ తమకు ఈ మేరకు విజ్ఞప్తి చేశారని చెప్పారు. కార్యక్రమంలో జేసీ కార్తీక్, డీఆర్‌వో అనిత, వివిధ నియోజకవర్గాల ఆర్‌వోలు, నోడల్ అధికారులు, రాజకీయ పార్టీ ప్రతినిధులు ఉన్నారు.

విజయమే లక్ష్యంగా పనిచేయండి



విజయనగరంలో భారీ ర్యాలీగా వెళ్తున్న టీడీపీ నాయకులు

విజయనగరం రూరల్, ఏప్రిల్ 3: రానున్న ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థుల విజయానికి పార్టీ శ్రేణులు మరింత శ్రమించాలని తెలుగుదేశం పార్టీ సీనియర్ నేత, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు అశోక్ గజపతిరాజు పిలుపునిచ్చారు. బుధవారం గజపతినగరం నియోజకవర్గంలోని గజపతినగరం మండలం మాజీ జడ్పీటీసీ మక్కువ శ్రీధర్ ఆధ్వర్యంలో సాయి సిద్ధార్థ సంస్థల అధినేత సీరంరెడ్డి రామ్‌కుమార్, సర్పంచ్‌లు కోండ్రుతు అనూష, సూరెడ్డి రామలక్ష్మి, మాజీ ఎంపీటీసీ ఈశ్వరరావు, రెడ్డి పాపినాయుడు, మాజీ సర్పంచ్‌లు రెడ్డి ప్రసాద్, అల్లు శ్రీను, జగన్నాథరాజు, సూర్యనారాయణ రాజుతో పాటు ఆయా గ్రామాల నుంచి భారీ సంఖ్యలో వైసీపీని వీడి టీడీపీలో చేరారు. వీరంతా ఆర్‌ఆర్‌బీ వద్ద నుంచి భారీ ర్యాలీగా అశోక్ బంగ్లాకు చేరకుని అశోక్ గజపతిరాజు సమక్షంలో పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థి కొండపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ, టీడీపీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. మాజీ జడ్పీటీసీ మక్కువ శ్రీధర్, ఎస్‌కోట మాజీ ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి, విజయనగరం పార్లమెంటు అభ్యర్థి కలిశెట్టి అప్పలనాయుడు, పార్టీ నాయకులు కొండపల్లి కొండలరావు, గోపాలరాజు, చప్పా రాజు, రుంకాన అరుణ, గుంప్రోతు గోవింద తదితరులు పాల్గొన్నారు.

టీడీపీని గెలిపిస్తేనే భవిష్యత్తు



23వ డివిజన్‌లో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న అదితి

విజయనగరం రూరల్: టీడీపీని గెలి పిస్తేనే భవిష్యత్తు ఉం టుందని టీడీపీ, జన సేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి అదితి గజపతి రాజు అన్నారు. బుధవారం విజయనగరం నియోజకవర్గంలో విస్తృతంగా ప్రచారం చేశారు. ఎన్నికల షెడ్యూల్ వెలువడిన నేపథ్యంలో ఆమె అన్ని డివిజన్లు, గ్రామాల్లో ఇంటింటికి వెళ్లి తనను గెలిపించాలని ప్రజలను కోరారు. నగరంలోని 23వ డివిజన్ పరిధిలోని పేర్ల వారి జంక్షన్‌లో ఇంటింటి కీ వెళ్లి సైకిల్ గుర్తుకి ఓటేయాలని ప్రజలను అభ్యర్థించారు. టీడీపీ నగర, డి విజన్ నాయకులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

విజయనగరం దాసన్నపేట: విజయనగరం అసెంబ్లీ బీజేపీ నాయకులు ఎన్‌డీఏ కూటమి అభ్యర్థి పూసపాటి అదితి గజపతిరాజును బుధవారం టీడీపీ కార్యాలయంలో కలిసి మద్దతు ప్రకటించారు. జాతీయ అధ్యక్షులు జేపీ నడ్డా, రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి సూచనల మేరకు రానున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఏపీలో కూటమి అధికారంలోకి రావాలని, దేశాభివృద్ధి బీజేపీతోనే సాధ్యమని ఆ పార్టీ నాయకులు ఇమంది సుధీర్, మజ్జి రమేష్‌లు తెలిపారు.

కూటమితోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యం



ఎల్‌కోట: మాట్లాడుతున్న లలితకుమారి

లక్కవరపుకోట: టీడీపీ-జనసేన-బీజేపీ కూటమితోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని ఎస్.కోట నియోజకవర్గ కూటమి అభ్యర్థి కోళ్ల లలితకుమారి తెలిపారు. బుధవారం ఆమె తన నివాసం వద్ద కూటమి నేతలతో కలిసి విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా లలిత కుమారి మాట్లాడుతూ విధ్వంసక పాలనకు తెరదించి.. ప్రజాపాలనకు అవకాశం కల్పించాలని కోరారు. ఈ సమావేశంలో విశాఖ పార్లమెంట్ బీజేపీ వైస్ ప్రెసిడెంట్ సీహెచ్.జగదీశ్వరి, జనసేన నియోజకవర్గ సమన్వయకర్త సత్యనారాయణ, బీజేపీ నేతలు వర్మ, అప్పారావు, రాము, టీడీపీ నేత మల్లా రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

జామి: మండలంలోని తానవరం, లక్ష్మీపురం గ్రామాల్లో కూటమి అభ్యర్థి లలితకుమారి బుధవారం ప్రచారం చేశారు. అత్యధిక మెజార్టీతో ఎమ్మెల్యే, ఎంపీలను గెలిపించాలని కోరారు.

ఆరికతోట పీహెచ్‌సీ తనిఖీ



రికార్డులు పరిశీలిస్తున్న డీఎంఅండ్‌హెచ్‌వో భాస్కరరావు

రామభద్రపు రం: ఆరికతోట ప్రాథ మిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా వైద్య, ఆరోగ్య శా ఖాధికారి భాస్కరరావు బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా ఎలక్ట్రానిక్ హెల్త్ రిజిస్టర్‌ను పరిశీలించి ఓపీ సంఖ్య తెలుసుకున్నారు. ప్రధానమంత్రి మాతృత్వ వందన యోజన కింద లక్ష్యాలను ఎంతవరకు అధిగమించారని ఆరా తీశారు. పీహెచ్ సీలో ఉన్న మందులు, ఇతర సమస్యలపై డీఎంఅండ్‌హెచ్‌వో ఆరా తీశారు. వైద్యాధికారి రతన్ దీపక్ తదితరులు పాల్గొన్నారు.

మిమ్స్ కార్మికులను అరెస్టు చేయడం అన్యాయం



రాస్తారోకో చేస్తున్న సీఐటీయూ నాయకులు

రామభద్రపురం: తమ న్యాయమైన కోర్కెలు పరిష్కరించాలని కోరుతూ సమ్మె చేస్తున్న మిమ్స్ ఉద్యోగులను అరెస్టు చేయడం అన్యాయమని సీఐటీయూ జిల్లా నాయకుడు బలసా శ్రీను అన్నారు. అరెస్టులను నిరసిస్తూ బుధవారం మండల కేంద్రంలో రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీను మాట్లాడుతూ మిమ్స్ ఉద్యోగులకు జీతాలు పెంచాలని, వేతన ఒప్పందం అమలు చేయాలని, కాంట్రాక్ట్ ఉద్యోగులను వెంటనే రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాంబార్కి రామకృష్ణ, నాగరాజు, జనార్దన తదితరులు పాల్గొన్నారు.

షిర్డీసాయి మందిర ప్రారంభోత్సవం



కలశాలతో భారీ ఊరేగింపుగా ఆలయానికి వెళ్తున్న మహిళలు

బొబ్బిలి, ఏప్రిల్ 3: మండలంలోని మెట్టవలస గ్రామంలో నూతనంగా నిర్మించిన షిర్డీసాయి మందిరం ప్రారంభోత్సవాన్ని భక్తసంఘం, గ్రామస్థులు కలిసి అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నారు. గురువారం జరగనున్న ఈ ప్రతిష్ఠకు ముందు రోజు బుధవారం గ్రామంలో మహిళలు పెద్దసంఖ్యలో కలశాలతో బాబా విగ్రహాన్ని మేళతాళాలతో భారీ ఊరేగింపు నిర్వహించారు. బాలికలు కోలాటమాడారు. బాబాకు జేజేలు పలుకుతూ పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. వేదపండితుల సారథ్యంలో ఈ క్రతువు నిర్వహిస్తున్నారు. గురువారం భారీ అన్నదానం చేపట్టనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

దుర్మార్గపు పాలనకు అంతం తప్పదు



రేగిడి: సంకిలిలో మాట్లాడుతున్న కోండ్రు

వంగర: రాష్ట్రా న్ని తీవ్రమైన ఆందోళ నకర స్థితిలోకి నెట్టేసిన వైసీపీ దుర్మార్గ పాలన అంతమొందడం ఖా యమని టీడీపీ, జన సేన, బీజేపీల ఉమ్మడి అభ్యర్థి కోండ్రు మురళీ మోహన్ అన్నారు. బాగెమ్మపేట, నీలయ్యవలస, పటువర్ధనం, కింజంగి, ఆర్‌ఆర్ కాలనీల్లో ఇంటింటికి వెళ్లి ప్రచారం చేశారు. టీడీపీ నాయకులు బొత్స వాసుదేవరావునా యుడు, పిన్నింటి మోహన్, ఎల్.కృష్ణమూర్తి, ధనలక్ష్మి, త్రినాథ, ఉదయాన మురళీకృష్ణ, శ్రీను, రవి, రాజాం, రేగిడి టీడీపీ నాయకులు పాల్గొన్నారు. ● **రాజాం:** అసమర్థ వైసీపీ ప్రభుత్వం మరికొద్ది రోజుల్లో కను మరుగు కానుందని టీడీపీ అభ్యర్థి, మాజీ మంత్రి కోండ్రు మురళీమోహన్ అన్నారు. బుధవారం పార్టీ కార్యాలయంలో టీడీపీ, బీజేపీ, జనసేన నాయకు లతో కలిపి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ● రాజాం నియోజకవర్గాన్ని ఎంతో అభివృద్ధి చేసిన టీడీపీ అభ్యర్థి కోండ్రు మురళీ మోహన్‌ను గెలిపించాలని పట్టణ టీడీపీ నాయకులు బుధవారం యాతవీధి, మల్లయ్యపేట కాలనీల్లో ప్రచారం చేశారు. ● **రేగిడి:** మండలంలో సంకిలి గ్రా మంలో బుధవారం టీడీపీ పార్టీ జయహో బీసీ ర్యాలీ, ఎన్నికల ప్రచారం నిర్వ హించారు. రాజాం నియోజకవర్గ టీడీపీ నేతలతో కోండ్రు భారీ ర్యాలీ నిర్వ హించి ఎన్నికల ప్రచారం చేశారు. ఈ సమావేశంలో సంకిలి, బొడ్డవలస, చిన్న య్యపేటలో ఎస్‌సీ,యాదవ, తెలగ, ఇతరకులాలకు చెందిన వంద కుటుంబా లు వైసీపీని వీడి టీడీపీలో చేరారు. కోండ్రు కండువాలు వేసి ఆహ్వానించారు.

పింఛన్ల పంపిణీ సక్రమంగా చేపట్టాలి



మాట్లాడుతున్న తహసీల్దార్ సులోచనారాణి

రామభద్రపురం: మండలంలోని అన్ని గ్రామ సచివాలయాల వద్ద పింఛన్ల పంపిణీ సక్రమంగా చేపట్టాలని తహసీల్దారు ఆకుల సులోచనారాణి తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం గ్రామ కార్యదర్శులు, వీఆర్వోలు, వెల్ఫేర్ అసిస్టెంట్‌లతో సమావేశం నిర్వహించారు. ఎండలు ఎక్కువగా ఉండడంతో పింఛను దారులకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని సూచించారు. సచివాలయాల వద్ద చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని, రాజకీయ నాయకుల ప్రోద్బలం లేకుండా చూడాలని కోరారు. ఈ సమావేశంలో ఎంపీడీవో ఈశ్వరమ్మ పాల్గొన్నారు.

నాణ్యమైన బోధనే లక్ష్యం



ఉపాధ్యాయసిబ్బందితో సమీక్షిస్తున్న ఎంఈవో

రేగిడి: ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యాబోధనే లక్ష్యంగా ఉపాధ్యాయులు పని చేయాలని ఎంఈవో బి.ఎరకయ్య ఉపాధ్యాయులకు సూచించారు. ఆమదాలవలస ప్రాథమిక పాఠశాలను ఎంఈవో బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఉపాధ్యాయుల పనితీరుపై సమీక్షించారు. ఆయన వెంట హెచ్‌ఎం వరుణ కుమారి తదితరులు ఉన్నారు.

పంచాయతీలకు 'విద్యుత్ షాక్'

● భారీగా బిల్లులు పెండింగ్ ● వీధి దీపాలకు సరఫరా నిలిపివేత

బొబ్బిలి: గ్రామ పంచాయితీలు వీధి దీపాల నిర్వహణ కోసం చెల్లించాల్సిన రూ.కోట్ల విద్యుత్ బకాయిలపై సంబంధిత అధికారులపై తీవ్ర ఒత్తిడి ఉంది. దీంతో ఎక్కడికక్కడ వీధి దీపాలకు సరఫరాను నిలిపివేస్తున్నట్టు సమాచారం. దీనిపై సాక్షాత్తూ విజయనగరం ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ కలుగజేసుకున్నారు. గ్రామాల్లో పర్యటించినప్పుడు సర్పంచులు వీధి దీపాల విద్యుత్ బిల్లుల సమస్యలను ఆయన దృష్టికి తెస్తున్నారు. విద్యుత్ సరఫరా నిలిచిపోతే గ్రామాలలో ప్రజల ముందు చులకనైపోతామని సర్పంచ్‌లంతా ఎంపీకి తెలిపారు. దీనిపై ఆయన ఇచ్చిన భరోసా అమలుకు నోచుకోవడం లేదు. బిల్లుల విషయమై సంబంధిత అధికారులతో మాట్లాడామని.. సర్పంచులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఎంపీ భరోసా ఇచ్చారు. క్షేత్ర స్థాయిలో పరిస్థితి భిన్నంగా ఉంది. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పంచాయితీలకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నారు. బొబ్బిలి విద్యుత్ డివిజన్ పరిధిలో 178 గ్రామ పంచాయితీల నుంచి రూ.2.45 కోట్ల బకాయిలు ఉన్నాయి. ఇందులో కేవలం రూ.17 లక్షలు మాత్రమే వసూలయ్యాయి.

జిల్లా పంచాయతీ అధికారికి లేఖలు రాశాం

కోట్ల రూపాయలలో ఉన్న బకాయిల కోసం జిల్లా పంచాయితీ అధికారికి, గ్రామ పంచాయితీల కార్యదర్శులకు ఏడాది నుంచి లేఖలు రాస్తున్నాం. ఇంతవరకు రూ.17 లక్షలు మాత్రమే వసూలైంది. ఉన్నతాధికారుల నుంచి మాపై తీవ్ర ఒత్తిడి ఉంది. విద్యుత్ సరఫరా నిలిపివేయాలని ఆదేశాలు ఉన్నాయి. దీనితో 50 నుంచి 60 పంచాయతీలు చెల్లింపులకు ముందుకొచ్చాయి. మాకు డబ్బులు చెల్లించకపోయినా సీఎఫ్ఎంఎస్ కు సంబంధించి టోకెన్ చెబితే సరిపోతుంది.

- అనంతరావు, విద్యుత్ ఈఈ, బొబ్బిలి



పంచాయతీలో ఓ వీధి దీపం

మద్యం సీసాల స్వాధీనం

రేగిడి: మజ్జిరామునిపేట సెంటర్‌లో బుధవారం స్థానిక పోలీసుల సోదాల్లో 16 మద్యం సీసాలతో ఓ వ్యక్తి పట్టుబడినట్టు ఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు. మంగళపేటకు చెందిన నిందితుడు బెల్ట్ షాపు నిర్వహణకు మద్యం తరలిస్తుండగా అరెస్టు చేసినట్టు ఎస్ఐ తెలిపారు. ఈ తనిఖీలో కానిస్టేబుల్ శివ తదితరులు పాల్గొన్నారు.

బాడంగి: అక్రమంగా మద్యం తరలిస్తున్న ఆనవరం గ్రామానికి చెందిన యామల శ్రీనివాసరావు నుంచి వంద మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్టు ఎస్ఐ ఆర్.జయంతి తెలిపారు. మోటారు సైకిల్‌పై మల్లంపేట వద్ద ఉన్న వైన్‌షాపు నుంచి అక్రమంగా తరలిస్తున్న సీసాలను పట్టుకున్నట్టు తెలిపారు. వీటి విలువ రూ.15 వేలు ఉంటుందని ఎస్ఐ తెలిపారు. నిందితుడిపై కేసు నమోదు చేసినట్టు చెప్పారు.

పేకాట శిబిరంపై పోలీసుల దాడి

విజయనగరం క్రైం: వన్‌టౌన్ పోలీసు స్టేషన్ పరిధిలోని ఒక హోటల్‌లో పేకాడుతున్న తొమ్మిది మందిని అదుపులోకి తీసుకుని రూ.లక్షా 8 వేల 650 నగదుతో పాటు, 10 మొబైల్స్ స్వాధీనం చేసుకున్నారు. తదుపరి చర్యల నిమిత్తం వన్‌టౌన్ పోలీసు స్టేషన్‌కు అప్పగించినట్టు ఎస్‌బీ పోలీసులు తెలిపారు.

డంపింగ్ యార్డులో మంటలు



మంటలను అదుపు చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

రాజాం: జెండాల దిబ్బ సమీపంలో ఉన్న డంపింగ్ యార్డులో గు ర్తు తెలియని వ్యక్తులు మంగళవారం మంట పె ట్టారు. అగ్నిమాపక, పుర పాలక కార్యాలయ సి బ్బంది మంటలను ఆర్ప డానికి తీవ్ర ప్రయత్నాలు చేశారు. బుధవారం కూడా మంటలు చెలరేగడంతో అగ్నిమాపక శాఖ అధికారులు మంటలను అదుపులోకి తెచ్చారు. కమిషనర్ జె.రామప్పలనాయుడు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, ఏఈ భాగ్యలక్ష్మి సంఘటన స్థలాన్ని పరిశీలించారు.

ఎన్నికల నిబంధనలు పాటించాలి



మాట్లాడుతున్న డీఎస్పీ గోవిందరావు

విజయనగరం క్రైం: ఎన్నికల నిబంధనలను ప్రతి ఒక్కరూ పాటించాలని విజయనగరం డీఎస్పీ ఆర్.గోవిందరావు అన్నారు. బుధవారం టూటౌన్ పరిధిలోని బాబామెట్టలో యువతకు ఎన్నికల నిబంధనలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత ఎన్నికల సమయంలో అల్లర్లకు, ఘర్షణలకు పాల్పడితే కేసులు నమోదు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సీఐ కోరాడ రామారావు, ఎస్ఐ దుర్గాప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

వీటికి ఎన్నికల కోడ్ వర్తించదా?



పెనుబాక సచివాలయం వద్ద ఉన్న శిలాఫలకాలు

రాజాం: స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణలో సత్యనారాయణపురం సచివాలయానికి ఎన్నికల నిబంధనల ప్రకారం వైసీపీ రంగులను తొలగించాలి. కానీ పురపాలక సంఘ అధికారులు సచివాలయ కిటికీలకు వేసిన రంగులు తొలగించకుండా జాప్యం చేస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఆర్టీసీ కాంప్లెక్స్ కావడంతో ప్రయాణికులు, బస్సుల కోసం వచ్చిన వారు ఆ రంగుల వైపు చూస్తున్నారు. అంతేకాకుండా పెనుబాక సచివాలయ శంకుస్థాపన, ప్రారంభోత్సవ కార్యక్రమాలకు ఏర్పాటు చేసిన శిలా ఫలకాలకు ముసుగు వేయకుండా అధికారులు వదిలేశారు.

సమన్వయంతో పనిచేయాలి

జామి: అందరూ కలిసి సమన్వయంతో పనిచేసి పార్టీ విజయానికి కృషి చేయాలని మంత్రి బొత్స సత్యనారాయణ సూచించారు. బుధవారం కుమరాం గ్రామంలో నిర్వహించిన వైసీపీ సమావేశానికి ముఖ్య అతిథిగా ఆయన హాజరై మాట్లాడారు. మంత్రి బొత్స సత్యనారాయణ మాట్లాడుతూ గ్రామాల్లో పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రతి ఇంటికీ వెళ్లాలని, వారు ఏం అడిగినా హామీ ఇచ్చి ఓట్లు వేయించాలని, తాము అధికారంలోకి వచ్చిన వెంటనే హామీలు నెరవేరుస్తామని చెప్పాలన్నారు. సమావేశం చివరిలో చింతాడ సర్పంచ్ సుబ్రహ్మణ్యం, భీమసింగి సర్పంచ్ వివిధ సమస్యలు ప్రస్తావించారు. భీమసింగి షుగర్స్ ఎప్పుడు తెరుస్తారని ప్రశ్నించారు. దీనిపై మంత్రి స్పందిస్తూ 'భీమసింగి షుగర్స్ ఇక లేదని... ఇక్కడ ఉన్న స్థలంలో లాభదాయకమైన ఫ్యాక్టరీ ఏర్పాటు చేద్దామని.. చెప్పారు. వర్గాలను, విభేదాలను పక్కన పెట్టి అందరూ కలిసికట్టుగా పనిచేయాలన్నారు. వైసీపీకి చెందిన మహిళలు పూర్తి బాధ్యత తీసుకొని ప్రచారం చేయాలని సూచించారు. గజపతినగరం ఎమ్మెల్యే అప్పలనరసయ్య గైర్హాజరయ్యారు. ఎస్.కోట ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు హాజరయ్యారు.

కృష్ణాపురంలో ఎల్లమ్మతల్లి ఆలయ ప్రతిష్ఠ



హోమం నిర్వహిస్తున్న దృశ్యం

బొబ్బిలి, ఏప్రిల్ 3: మండలంలోని కృష్ణాపురం గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న ఎల్లమ్మతల్లి ఆలయ ప్రతిష్ఠ మహోత్సవాన్ని బుధవారం గ్రామ పురోహితులు నిష్టల ధర్మారావు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సదర్భంగా ప్రత్యేక హోమం, కుంకుమ పూజలు నిర్వహించారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

బీసీలకు తీరని అన్యాయం

● గజపతినగరం నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి శ్రీనివాస్



మాట్లాడుతున్న శ్రీనివాస్

గజపతినగరం: జగన్ అధికారంలోకి వచ్చిన తర్వాత బీసీలకు తీరని అన్యాయం జరిగిందని, చంద్రబాబు అధి కారంలోకి వస్తే న్యాయ జరుగు తుందని గజపతినగరం నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు. బుధవారం మండలంలోని బూదేవి పేట లో క్లస్టర్ ఇన్‌చార్జి డాకి నారాయణప్పల నాయుడు ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపీ హయాంలో బీసీ కార్పొరేషన్ ఏర్పాటు చేసి రుణాలు , కుల వృత్తులను ప్రోత్సహిం చేందుకు ఆదరణ పరికరాలను అందజేసినట్లు తెలిపారు. జగన్ అధికారంలోకి వచ్చి 30 పథకాలను రద్దు చేశారని ఆరోపించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ గంట్యాడ శ్రీదేవి, క్లస్టర్, యూనిట్ ఇన్‌చార్జిలు పాల్గొన్నారు.

పవన్ కల్యాణ్ పర్యటన వాయిదా

● నెల్లిమర్ల నియోజకవర్గ కూటమి అభ్యర్థి మాధవి వెల్లడి



మాట్లాడుతున్న లోకం మాధవి

నెల్లిమర్ల:నెల్లిమర్లలో గురువారం జరగాల్సిన జనసేన అధినేత పవన్‌కల్యాణ్ పర్యటన వాయిదా పడిందని ఆ పార్టీ నాయకురాలు, నెల్లిమర్ల నియోజకవర్గ కూటమి అభ్యర్థి లోకం మాధవి తెలిపారు. తొలుత పవన్ కల్యాణ్ పర్యటన, రామ తీర్థం జంక్షన్‌లో సభా ఏర్పాట్లను టీడీపీ నాయకులతో కలిసి పరిశీలించారు.అనంతరం హెలిప్యాడ్ చూసేందుకు వెళ్తుండగా ఆమెకు పవన్‌కల్యాణ్ పర్యటన వాయిదా పడినట్లు సమాచారం అందింది. దీంతో స్థానిక మొయిద జంక్షన్‌లోని పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. తీవ్రమైన జ్వరంతో బాధపడుతున్నారని, వైద్యుల సలహా మేరకు విశ్రాంతి తీసుకోవాల్సి ఉన్నందున నెల్లిమర్ల పర్యటన తాత్కాలికంగా వాయిదా పడినట్లు తెలిపారు. పర్యటన మళ్లీ ఎప్పుడు జరుగుతుందన్న విషయంపై త్వరలో తేదీలు ప్రకటించనున్నట్లు చెప్పారు. సమావేశంలో జనసేన నాయకులు పాలవలస యశస్వి, పడాల అరుణ, ఆదాడ మోహనరావు, టీడీపీ నాయకుడు సువ్వాడ రవిశేఖర్, మండల కమిటీ అధ్యక్షుడు కడగల ఆనంద్ కుమార్, పార్టీ నాయకులు కంది చంద్రశేఖరరావు, పతివాడ అప్పలనారాయణ, పల్లె భాస్కరరరావు, గేదెల రాజారావు, బీజేపీ నాయకుడు బూర్లె శ్రీధర్ పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీ సక్రమంగా చేపట్టాలి

దత్తిరాజేరు: పింఛన్ల పంపిణీ సక్రమంగా చేపట్టాలని ఎంపీడీవో పడాల చంద్రకుమారి కోరారు. బుధవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో పలు శాఖల అధికారులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గురువారం నుంచి ఏడు ఉదయం నుంచి సాయంత్రం ఏడు వరకు పింఛన్లు పంపిణీ చేయాలని కోరారు.అనారోగ్యం ఉన్నవారికి ఇంటికి వెళ్లి పింఛన్లు అందించాలన్నారు. పింఛన్లు పంపిణీ వద్ద ఎటువంటి రాజకీయ నాయకుల జోక్యం ఉండరాదని, తాగునీరు సదుపాయం ఏర్పాటు చేయాలని తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ సుదర్శనరావు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు. **గంట్యాడ:** ఎన్నికల కోడ్ అమల్లో ఉన్న నేపథ్యంలో పింఛన్లు పంపిణీ వెంటనే చేపట్టాలని మాజీ వైస్ ఎంపీపీ రంధి రామునాయుడు, ఎంపీటీసీ మాజీ సభ్యుడు జగన్నాథం కోరారు.ఈ మేరకు బుధవారం ఎంపీడీవో భవానీకి వినతి పత్రం అందజేశారు. కాగా పింఛన్ డబ్బుల కోసం సచివాలయం సిబ్బంది లక్కిడాం స్టేట్ బ్యాంకు వద్ద నిరీక్షించారు. సాయంత్రం కొన్ని గ్రామ సచివాలయాలకు సిబ్బంది డబ్బులు అందగా, మరికొంతమంది అందకపోవడంతో ఎదురు చూడాల్సి వచ్చింది.

వృద్ధులకు సదుపాయాలు కల్పించాలి

గజపతినగరం: గ్రామ సచివాలయాల్లో పింఛన్ కోసం వచ్చిన వృద్ధులకు సదుపాయాలు కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో జయింతి ప్రసాద్ కోరారు. బుధవారం స్థానిక మండలపరిషత్ కార్యాలయంలో గ్రామ కార్యదర్శులతో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గురువారం నుంచి ఆరో తేదీ వరకు మూడురోజుల్లో పింఛన్లు పంపిణీ పూర్తి చేయాలన్నారు. గ్రామ సచివాలయాల వద్ద ఎండలతీవ్రతను దృష్టిలో పెట్టుకుని చలివేంద్రాలతో పాటు టెంట్లు ఏర్పాటుచేయాలన్నారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉండడంతో కేవలం ఒక్క మంచినీరు తప్పా మజ్జిగ ఇవ్వరాదని, దాతల నుంచి ఎటువంటి విరాళాలు సేకరించరాదని సూచించారు. ఉదయం తొమ్మిది గంటల నుంచి పింఛన్ల పంపిణీ ప్రారంభించాలన్నారు. కార్యక్రమంలో గజపతినగరం, పురిటిపెంట ఈవోలు ఎం.రమణ, జనార్దనరావు పాల్గొన్నారు.

వలంటీర్ల రాజీనామాకు ఒత్తిడి

● జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి విసినిగిరి శ్రీనివాసరావు

చీపురుపల్లి: వలంటీర్లు రాజీనామా చేయాలని వైసీపీ నాయకులు ఒత్తిడి చేస్తున్నారని జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి విసినిగిరి శ్రీనివాసరావు ఆరోపించారు. బుధవారం చీపురుపల్లిలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రజల మద్దతు కోల్పోయిన ప్రభుత్వం వలంటీర్లను తమ వెంట తిప్పుకోడానికి ప్రయత్నిస్తోందని ఆరోపించారు. వార్ని వైసీపీ నాయకులు పలు విధాలుగా ప్రలోభపెడుతున్నారని విమర్శించారు. ఎటూ తేల్చుకోలేక వలంటీర్లు అయోమయంలో పడిపోతున్నారని తెలిపారు. కూటమి గెలుపు ఖాయమని గమనించిన వైసీపీ ఇటువంటి చీప్ ట్రిక్కులు ప్రయోగిస్తోందని ఆరోపించారు.

కాలువ కప్పేసి.. కబ్జా చేసేశారు

● ఇదీ రాజాం మునిసిపాలిటీలో పరిస్థితి

రాజాం రూరల్: రాజాం, చుటుపక్కల భూముల ధరలకు రెక్క లొస్తుండడంతో ఖాళీ స్థలం కనిపిస్తే పాగా వేసేస్తున్నారు. ప్రభుత్వ, ప్రైవే టు భూమైనా కబ్జాదారులు వెనుకడుగు వేయడంలేదు. ఇటీవల రాజాం నగర పంచాయతీ నుంచి మునిసిపాలిటీగా రూపాంతరం చెందడం, శరవే గంగా అభివృద్ధి చెందుతుండడంతో స్థలాలకు ఒక్కసారిగా ధరలు పెరిగాయి. ఈనేపథ్యంలో రాజాం మునిసిపాలిటీ పరిధిలో ఓ పబ్లిక్ స్కూల్ సమీపంలో తోటపల్లి పిల్లకాలువపై నిర్మించిన కల్వర్టుకు ఆనుకుని ఉన్న కాలువను కొందరు మట్టితో కప్పి ఆక్రమించారు. ఎగువ ప్రాంతం నుంచి వచ్చే నీరు పొలాల్లోకి వెళ్లకుండా సమీపంలో చెరువులోకి చేరేలా గతంలో కాలువను ఏర్పా టుచేశారు. ఈనేపథ్యంలో ఇక్కడ కొంత మేర ఖాళీ స్థలం కనిపిం చడంతో మట్టితో కప్పి కొందరు చదునుచేశారు. దీంతో చెరువులోకి నీరు చేరకుండా పొలాల్లోకి వెళ్లి పంటలు దెబ్బతినే అవకాశముంటుందని బుచ్చెంపేట, బాలకవివలస, పనసలవలస రైతులు ఆందోళన వ్యక్తంచేస్తు న్నారు. వర్షాకాలంలో మిగులు నీరు చెరువులోకి చేరకపోతే ఖరీఫ్ శివారు లో, రబీలో పంటలకు నీరందే అవకాశం ఉండదని, దీంతో పంటలపై ప్రభావం పడుతుందని వాపోతున్నారు. తక్షణమే రెవెన్యూ, నీటి పారుదల శాఖల అధికారులు జోక్యం చేసుకుని కబ్జాకు గురైన మట్టిని తొలగించాలని రైతులు కోరుతున్నారు.



ఆక్రమణకు గురైన సాగునీటి కాలువ

ఆనవాళ్లు కోల్పోయి.. ఆయకట్టుకు నీరందక

● తుప్పలు, డొంకలు పేరుకుపోయిన వైనం

● ఇదీ వంగర మండలంలో తోటపల్లి కాలువల పరిస్థితి



కొట్టిశ వద్ద పొదలతో దర్శనమిస్తున్న కాలువ

వంగర

తోటపల్లి కాలువలు దశాబ్దాలుగా నిర్వహణకు నోచుకోకపోవడంతో ఆనవాళ్లు కోల్పోయాయి. దీంతో ఏటా ఖరీఫ్‌లో సైతం శివారు ఆయకట్టుకు నీరందడం లేదు. దీంతో అన్నదాతలకు అగచాట్లు తప్పడం లేదు. ఏటా బడ్జెట్‌లో కాలువల మరమ్మతులు, ఆధునికీకరణకు నిధులు కేటాయిస్తున్నా క్షేత్రస్థాయిలో కార్యరూపం దాల్చడంలేదు. వంగర వంటి వర్షాధార మండలాల రైతులకు అవస్థలు తప్పడం లేదు.

ఇదీ పరిస్థితి..

వంగర మండలంలోని కొత్తవలస, కొట్టిశ, బంగారువలస తదితర 5 గ్రామాల్లో 19 వందల ఎకరాలకు నీరందించేందుకు 1972లో ఐదున్నర కిలోమీటర్ల మేర తోటపల్లి కాలువలు తవ్వారు. ఈ కాలువ పార్వతీపురం మన్యం జిల్లాలోని బలిజిపేట మండలంలోని గౌరిపురం నుంచి కొట్టిశ వద్ద మండలంలోకి ప్రవేశించి వంగర వద్ద ముగుస్తుంది. కాలువలు ఏర్పాటుచేసి ఐదు దశాబ్దాలు గడుస్తోంది. పూర్తిస్థాయిలో ఏ ఒక్కసారి కూడా కాలువలు మరమ్మతు, ఆధునికీకరణ లేకపోవడంతో ఎన్నడూ పూర్తిస్థాయి ఆయకట్టుకు ఖరీఫ్‌లో సైతం నీరందని పరిస్థితి నెలకొందని రైతులు వాపోతున్నారు. ఈ కాలువ ఆధారంగా సుమారు 1200 మంది రైతులు సాగుచేసి జీవిస్తున్నారు.

ఖరీఫ్‌లో అన్నదాతకు అగచాట్లు..

కాలువలు ఆనవాళ్లు కోల్పోయి, పూర్తిస్థాయిలో తుప్పలతో మూసుకుపోయాయి. దీంతో కనీసం 200 క్యూసెక్కుల ప్రవాహం కూడా వెళ్లడం లేదని రైతులు వాపోతున్నారు. దీంతో పలుసార్లు మరమ్మతులు చేయాలని అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. అయితే తోటపల్లి అధికారులు చర్యలు తీసుకోకపోవడంతో ఏటా ఖరీఫ్‌లో ప్రారంభంలో రైతులు తలో కొంత వేసుకుని విరాళాలు సేకరించి, శ్రమదానంచేసి కాలువల్లో పూడికలు తొలగిస్తున్న విషయం విదితమే. ప్రధానంగా గౌరిపురం వద్ద వేగావతి నది ఆనుకుని గట్టు ఏర్పాటుచేయాల్సిఉంది. గట్టు లేకపోవడంతో కాలువలోకి నీరురాకుండా నదిలోకి వెళ్లిపోతోందని రైతులు చెబుతు న్నారు.ఇక్కడి కాలువలపై అధికారులు, ప్రజాప్రతినిధులు నిర్లక్ష్యం చూపుతున్నారని పలువురు వాపోతున్నారు. కొప్పర నుంచి సీతారాంపురం వరకు కాలువ పరిధిలో ఉన్న సుమారు ఎనిమిది వందల ఎకరాలకు ఖరీఫ్‌లో సైతం నీరందడంలేదని రైతులు పేర్కొంటున్నారు. ప్రధానంగా కాలువ గట్టు లేకపోవడంతో పంటలు పాడవుతున్నాయని కొత్తవలస, కొట్టిశ, బంగారువలస తదితర గ్రామాల రైతులు తెలిపారు. ఈ విషయాన్ని పలుసార్లు అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా ఫలితం లేకుండాపోయిందని వాపోతున్నారు. కనీస ఉపాధిహామీ పథకం ద్వారానైనా కాలువల్లో పేరుకుపోయిన తుప్పలు, డొంకలు తొలగించి రానున్న ఖరీఫ్‌లోనైనా సజావుగా ఆయకట్టుకు నీరందేలా చర్యలు తీసుకోవాలని పలువురు రైతులు కోరుతున్నారు. కాగా కాలువ పనులకు నిధులు మంజూరయ్యాయని, త్వరలో ఈ పనులు చేపడతామని తోటపల్లి ప్రాజెక్టు ఈఈ వెంకటేశ్వరరావు ఆంధ్రజ్యోతికి తెలిపారు.

ఆ మద్యం ఎక్కడిది..?

● తనిఖీల్లో బయటపడుతున్న వైనం ● ఇదీ రేగిడి మండలంలో పరిస్థితి

రేగిడి: మండలంలో సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో చెక్‌పోస్టుల వద్ద పోలీసులు, ఎస్‌ఈబీ సిబ్బంది తనిఖీ పకడ్బందీగా చేస్తుండడంతో వందల సంఖ్యలో సీసాలు, సారా పట్టుబడుతోంది. అయితే ఈ మద్యం ఎక్కడి నుంచి వస్తుందోనన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ప్రధానంగా గ్రామాల్లో పెద్దసంఖ్యలో బెల్ట్ దుకాణాలు నిర్వహిస్తున్నారు. వీటికి అవసరమైన మద్యం ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తున్న షాపుల నుంచే వస్తున్నట్లు ఆరోపణలొస్తున్నాయి. ఈనెల ఒకటో తేదీన కాగితాపల్లి సెంటర్‌లో ఉద్దవోలుకు చెందిన ఇద్దరు వ్యక్తుల నుంచి 70 మద్యంసీసాలు పోలీసులు స్వాధీనం చేసుకున్న విషయం విదితమే. ఇవి కాగితాపల్లి మద్యం దుకాణాలు కొనుగోలుచేసినట్లు దర్యాప్తులో గుర్తించినట్లు రాజాం ఎస్‌ఈబీ అధికారులు తెలిపారు.

ఇదీ పరిస్థితి..

కాగితాపల్లి, ఉంగరాడమెట్ట, వండానిపేటరూట్‌లో ప్రభుత్వ మద్యంషాపులు నిర్వహిస్తున్నారు. ఇదే సమయంలో పకడ్బందీగా ఎన్నికల నిర్వహణలో భాగంగా అక్రమ మద్యంపై అధికారులు దృష్టిసారించారు. దీంతో పోలీసుల తనిఖీల్లో అనధికారికంగా నిర్వహిస్తున్న బెల్ట్ దుకాణాలకు మద్యం తరలిస్తున్నట్లు గుర్తిస్తున్నారు. మూడునెలల్లో 43 మంది నుంచి 1,250 మద్యం సీసాలు స్వాధీనం చేసుకోగా, 20 లీటర్ల వరకు సారా పట్టుబడిందని రేగిడి పోలీసులు చెబుతున్నారు. ఇలా పట్టుబడిన వారిలో ఎక్కువ మంది బెల్ట్ దుకాణాల నిర్వాహకులే ఉండడం విశేషం. మద్యం షాపుల సిబ్బందే ఈ వ్యవహారంలో ప్రధాన ప్రాతదారులుగా వ్యవహరిస్తున్నారన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. సీసాలపై అదనంగా వసూలుచేసి గ్రామాల్లో బెల్ట్ దుకాణాలకు తరలిస్తున్నారన్న ఆరోపణలొస్తున్నాయి. ఇటీవల ఓ గ్రామంలో పోలీసులు బెల్ట్ దుకాణ నిర్వాహకుడి నుంచి 50 మద్యం సీసాలు స్వాధీనం చేసుకుని అరెస్టుచేసిన విషయం విదితమే.

మద్యం విక్రయాల నియంత్రణకు చర్యలు..

రేగిడి మండలంలో మద్యం విక్రయాలు పూర్తిగా నియంత్రించేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఎస్‌ఈబీ సీఐ శ్రీధర్ తెలిపారు. రాజాం ఏరియాలో ఇప్పటివరకు 60 మద్యం కేసులు నమోదుచేసినట్లు చెప్పారు. గత ఏడాది కంటే ఎక్కువ కేసులు పెట్టినట్లు తెలిపారు. మద్యం సీసాలు ఎక్కువ సంఖ్యలో దొరికినచోట్ల దుకాణాల సిబ్బంది ప్రమేయం ఆరాతీస్తున్నట్లు చెప్పారు. ఇటువంటి విక్రయాలపై దృష్టిసారిస్తామని తెలిపారు. ఉద్దవోలుకు చెందిన ఇద్దరు వ్యక్తులు కాగితాపల్లి షాపులో కొనుగోలు చేయడం, వీరికి అన్ని సీసాలు ఎలావచ్చాయి అన్న విషయంపై సమాచారం సేకరిస్తున్నట్లు చెప్పారు.

ఎన్నికల నిబంధనలను పాటించండి



జియ్యన్నవలస గ్రామస్థులకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు

బొండపల్లి: ఎన్నికల నిబంధనలను ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాటించాలని.. లేకుంటే కఠిన చర్యలు తప్పవని డీఎస్పీ శ్రీనివాసరావు సూచించారు. జియ్యన్నవలసలో బుధవారం సాయత్రం గ్రామస్థులకు ఎన్నికల నిబంధనలపై అవగాహన కల్పించారు. తగాదాలకు దూరంగా ఉండాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఐ కె.లక్ష్మణరావు, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అనంత వేంకటేశ్వరుని ఆలయ ప్రతిష్ఠ



పూజలు నిర్వహిస్తున్న స్వరూపానంద సరస్వతి

గంట్యాడ: తాటిపూడి రిజర్వాయర్‌కు అవతల గల ఎగువ కొండపర్తి (వైకే పర్తి) గ్రామంలో అనంత వేంకటేశ్వర స్వామి దేవాలయ ప్రతిష్ఠా కార్యక్రమం బుధవారం ఘనంగా నిర్వహించారు. నాలుగు రోజుల నుంచి ఆలయం వద్ద ప్రత్యేకంగా యాగాలు, హోమాలు చేస్తున్నారు. చివరి రోజున స్వామి వారి విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ జరిగింది. ఈ కార్యక్రమంలో పండితులు చామర్తి శేఖర్‌చార్యులు, ఆలయ ధర్మకర్త కర్రి సముద్రా రెడ్డి, గిరిజనులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

టీడీపీలో 150 కుటుంబాల చేరిక

పార్వతీపురం రూరల్: మండలంలోని నర్సిపురంలో టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి బోనెల విజయచంద్ర, మాజీ ఎమ్మెల్సీ జగదీష్, నాయకులు గొట్టాపు గౌరీ, గొట్టాపు వెంకటరమణ, చొక్కా జయప్రకాష్ ఆధ్వర్యంలో 150 కుటుంబాలు బుధవారం వైసీపీ నుంచి టీడీపీలో చేరాయి. ఈ సందర్భంగా విజయ్‌చంద్ర మాట్లాడుతూ ప్రజలకు కనీసం తాగునీరు కూడా అందించలేని పరిస్థితుల్లో వైసీపీ ప్రభుత్వం ఉందని ఆరోపించారు. జగదీష్ మాట్లాడుతూ విజయచంద్ర విజయం కోసం ప్రతి ఒక్కరూ కృషిచేయాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ, జనసేన మండలా అధ్యక్షులు దేవీ చంద్రమౌళి, గురుమణి,టీడీపీనాయకులు వేగిరెడ్డి తవిటినాయడు, కర్రి రామ్మూర్తి, ఎం.రవి ప్రసాద్, ఎం.ఆదినారాయణ, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

● **పార్వతీపురంటౌన్:** పట్టణంలోని పదో వార్డుకు చెందిన 20 కుటుంబాలు వైకేఎం కాలనీలోని టీడీపీలో ఆ పార్టీ పార్వతీపురం నియోజకవర్గ అభ్యర్థి బోనెల విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో చేరాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని రాక్షస పాలనకు చరమగీతం పాడే సమయం దగ్గర పడిందన్నారు.

ఏవోబీలో చెక్‌పోస్టులు ఏర్పాటు: సీఐ

గుమ్మలక్ష్మీపురం:మండలంలోని కేదారపురం, తాటిచెల గ్రామాల సమీపంలో ఒడిశా సరి హద్దు ప్రాంతాల్లో చెక్‌పోస్టులను ఏర్పాటు చేస్తున్నట్లు ఎల్విన్ పేట సీఐ పి.సత్యనారాయణ తెలిపారు. బుధవారం గుమ్మలక్ష్మీపురంలో విలేక రులతో మాట్లాడారు. సీసీ కెమెరాలు కూడా ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు.

గిరిజనుల సమస్యలు పరిష్కరిస్తా: సంధ్యారాణి

సాలూరు రూరల్: గెలిచిన వెంటనే గిరిజనుల సమస్యలను పరిష్కరిస్తానని సాలూరు నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి గుమ్మిడి సంధ్యారాణి తెలిపారు. బుధవారం తుండ పంచాయతీలోని చిన ఊటగెడ్డ, చెల్లూరివలస, ఉల్లి చింతలవలస, అప్పన్న దొరవలసల్లో ప్రచారం చేశారు. ఈ సందర్భంగా 500 మంది టీడీపీలో చేరారు. కార్య క్రమంలో టీడీపీ సాలూరు మండలాధ్యక్షుడు ఆముదాల పరమేశు, అక్యాన తిరుపతి రావు, తొత్తడి సూకరాజు, శ్రీరామ్ సత్తిబాబు, కృష్ణ, బాలాజీ పాల్గొన్నారు.

నేటి నుంచి అంగన్‌వాడీ కేంద్రాలకు ఒంటిపూట

సీతంపేట:ఎండలు తీవ్రత దృష్ట్యా అంగన్‌వాడీ కేంద్రాలు గురువారం నుం చి ఒంటిపూట పనివేళలు మారుస్తూ స్త్రీశిశు సంక్షేమశాఖ ఆదేశాలు జారీ చేసి నట్లు సీడీపీవో రంగలక్ష్మి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మే 31 వరకు ఉదయం 8 గంటల నుంచి 12గంటల వరకు కేంద్రాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. గర్భిణులు, బాలింతలకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామని తెలిపారు. కేంద్రాలకు వచ్చిన ఆరేళ్లలోపు పిల్లలకు వడదెబ్బ తగలకుండా కేంద్రాల నిర్వాహకులు ప్రత్యేక దృష్టి పెట్టాలని పేర్కొన్నారు. తాగునీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందు బాటులో ఉంచుకోవాలని తెలిపారు. మే 1వ తేదీ నుంచి 15 వరకు అంగన్‌వాడీ కార్యకర్తలకు సెలవులు ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. మండలంలోని 231 అంగ న్‌వాడీ కేంద్రాలు ఈ పనివేళలు పాటిస్తాయని తెలిపారు

కాంగ్రెస్‌తోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యం

పాలకొండ: కాంగ్రె స్‌తోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని ఆ పార్టీ పాలకొండ నియోజ కవర్గ అసెంబ్లీ అభ్యర్థి సవర చంటిబాబు తెలి పారు. బుధవారం పట్టణంలో విలేకరులతో మాట్లాడుతూ దివంగత నేత వైఎస్ రాజశేఖర రెడ్డి హయాంలో జరిగిన అభివృద్ధిని ప్రజలు మరిచిపోలేదన్నారు.కాంగ్రెస్‌పార్టీ షర్మిలారెడ్డి నేతృత్వంలో రాష్ట్రంలో బలపడుతోందని తెలిపారు.పార్వతీపురం అసెంబ్లీ అభ్యర్థి బత్తిన మోహన్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ రెండుసార్లు రాజశేఖరరెడ్డి హయాంలో చేసిన అభివృద్ధిని చూసి ప్రజలు పట్టం కట్టారని తెలిపారు.

సాలూరులో యువకుడి ఆత్మహత్య

సాలూరు: పట్టణంలో అనారో గ్యం సమస్యతో సతమతమవుతు న్న ఉల్లి వినయ్‌కుమార్ (30)ఆత్మ హత్యకు పాల్పడాడు. పోలీసులు, బంధువుల కథనం మేరకునన పట్టణంలో వడ్డీవీధిలో నివాసముం టున్న వినయ్‌కుమార్ కొంత కాలంగా అనారోగ్య సమస్యలతో ఇబ్బందిపడుతున్నాడు. దీంతో ఇం ట్లో ఎవరూలేని సమయంలో ఫ్యాన్‌కు ఉరివేసుకున్నాడు. వినయ్‌కుమార్ భార్య శ్రావణి, తల్లి లక్ష్మి పనిమీద బయటకు వెళ్లారు. ఇంటికి వచ్చి తలుపులు తీసేసరికి ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఉండడంతో కేకలు పెట్టారు. దీంతో ఎదురుగా తాపీపని చేస్తున్న కొంతమంది కూలీలు వచ్చి మృతదేహాన్ని కిందకు దించారు. వినయ్‌కుమార్ కుమార్తె ఉంది. పట్టణ సీఐ వాసునాయుడు కేసు నమోదు చేశారు.

రహదారి ప్రమాదంలో ఒకరి మృతి

సీతంపేట: సీతంపేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని కె.గుమ్మడ సమీపంలో బుధవారం జరిగిన రహదారి ప్రమాదంలో ఓ వ్యక్తి మృతిచెందాడు. మోహన్‌కాలనీ నుం చి కొత్తూరు వైపు వెళ్తున్న వ్యాన్, సీతంపేట నుంచి కొత్తూరు వెళ్తున్న ద్విచక్రవాహనం ఎదురెదురుగా ఢీకొ న్నాయి. దీంతో ద్విచక్ర వాహన చోదకుడు అక్కడికక్కడ మృతిచెందాడు. వ్యాన్ తిరగబడిపోవడంతో వ్యాన్ డ్రైవర్‌కు స్వల్పగాయాలయ్యాయి. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ జగదీష్‌నాయడు తెలిపారు.

ఇద్దరికి గాయాలు

గరుగుబిల్లి: మండలంలోని ఎర్రన్నగుడి సముదా యంలో మంగళవారంరాత్రి ద్విచక్రవాహనం, కారు ఢీకొన్న సంఘటనలో ఇద్దరికి గాయాలయ్యాయి. ఎస్‌ఐ అమ్మన్న రావు కథనం మేరకు.. ఖడ్గవలస జంక్షన్ నుంచి పార్వతీ పురం వస్తున్న ద్విచక్రవాహనాన్ని పార్వతీపురం నుంచి గుమ్మలక్ష్మీపురంవైపు వెళ్తున్న కారుఢీకొంది. దీంతో ద్విచక్ర వాహనంపై వెళ్తున్న పార్వతీపురానికి చెందిన మర్రి దాలయ్య, ఎస్.ప్రదీప్ గాయపడగా జిల్లా కేంద్రాసుపత్రికి తరలించారు. కారును నడిపిన ఎల్విన్‌పేటకు చెందిన నీలకంఠేశ్వరరావుపై కేసు నమోదు చేశారు.

చాకివలసలో పారిశుధ్య లోపం



కాలువలో పేరుకుపోయిన మురుగు

భోగాపురం: చాకివలస పంచాయతీలో పారిశుధ్య లోపం సమస్యగా మారింది. పంచాయతీలో కొన్ని రోజులుగా పారిశుధ్య పనులు నిర్వహించకపోవడంతో మురుగు కాలువలు పూడికతో నిండుకున్నాయి. దీంతో గ్రామంలో దోమలు విజృంభిస్తున్నాయి. ఇప్పటికైనా కాలువల్లో పూడిక తొలగించి... గ్రామం పరిశుభ్రంగా ఉండేలా చూడాలని పంచాయతీ అధికారులను స్థానికులు కోరుతున్నారు.

ఊపిరి పీల్చుకున్న ముక్కాం

భోగాపురం: ముక్కాం గ్రామం నుంచి వలసవెళ్లి... విశాఖలో నివాసం ఉంటున్న మత్స్యకారులు సముద్రంలో గల్లంతై... సురక్షితంగా బయటకు రావడంతో స్థానికులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఈ నెల 1న ఆరుగురు మత్స్యకారులు పడవపై సముద్రంలో వేటకు వెళ్లారు. అనుకున్న సమయానికి వీరు ఒడ్డుకు చేరకపోవడంతో గల్లంతయ్యారని బంధువులు ఆందోళనకు గురయ్యారు. మంగళవారం అర్ధరాత్రి సమయంలో ఆచూకీ లభ్యం కావడంతో కుటుంబ సభ్యులు, బంధువులు ఊపిరి పీల్చుకున్నారు.

కోడి పందేలరాయుళ్ల అరెస్టు

బొండపల్లి: గొల్లుపాలెం శివారులో కోడి పందాలు ఆడుతుండగా ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకొని అరెస్టు చేసినట్టు ఎస్‌ఐ కె.లక్ష్మణరావు తెలిపారు. ఐదు కోడి పుంజులతో పాటు రూ.920 నగదును స్వాధీనం చేసుకొని ముగ్గురిని అరెస్టు చేసినట్టు తెలిపారు.

ప్రశాంత పోలింగ్‌కు సహకరించాలి

గంట్యాడ: ప్రశాంత వాతావరణంలో పోలింగ్ నిర్వహించడానికి అందరూ సహకరించాలని విజయనగరం రూరల్ సీఐ ఎం.శ్రీనివాసరావు సూచించారు. బుధవారం తాటిపూడి రిజర్వాయిర్ ఆవల ఉన్న డీకేపర్తి గిరిజన గ్రామంలోని పోలింగ్ కేంద్రాన్ని ఎస్‌ఐ సురేంద్రనాయుడుతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎటువంటి అల్లర్లు జరగకుండా ఎన్నికలు జరిగే విధంగా చూడాలని కోరారు.

మలుపుల వద్ద సూచికలేవీ?



ఇటకర్లపల్లి- జి.ములగాం రోడ్డు మలుపులో సూచిక బోర్డులు లేని దృశ్యం

చీపురుపల్లి: మండలంలోని ప్రధాన రహదారుల్లో సూచిక బోర్డులు లేక ప్రయాణికులు ప్రమాదాలకు గురవుతున్నారు. ముఖ్యంగా శ్రీకాకుళం రోడ్డు నుంచి గచ్చలవలస, పెదనడిపల్లి, చిననడిపల్లి, అలక నారాయణపురం మీదుగా కమ్మసిగడాం వెళ్లే రహదారి, అలజంగి నుంచి పేరిపి గొల్లలపాలెం మీదుగా కమ్మసిగడాం వెళ్లే రహదారుల్లో విపరీతమైన మలుపులు ఉన్నాయి. ఈ ప్రాంతాలలో సూచికలు లేకపోవడం వల్ల చాలాసార్లు ప్రమాదాలు చోటు చేసుకున్నాయి. ఇప్పటికైనా మలుపుల వద్ద సూచికలు ఏర్పాటు చేయాలని ఈ ప్రాంత ప్రజలు కోరుతున్నారు.